క్లుప్తంగా

13న జాతీయ లోక్ అదాలత్


న్యాయమూర్తి ఆరీఫా షేక్

పుంగనూరు: పుంగనూరు కోర్టు ఆవరణలో ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సీనియర్ సివిల్‌జడ్జి ఆరీఫా షేక్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో రాజీకి అనువైన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామన్నారు. న్యాయవాదులు, అన్నిశాఖల అధికారులు తమ పరిధిలోని కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేందుకు కృషి చేసి, ప్రజల మధ్య శాంతియుత వాతావరణం నెలకొల్పాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఐలు కేవీ. రమణ, రమేష్‌బాబు, శివశంకర్, నాగేశ్వరరావు, ఎక్సైజ్ ఎస్‌ఐ వేణుగోపాల్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

ఎస్‌డీపీఐ నూతన కమిటీ ఎన్నిక

పుంగనూరు: పట్టణంలోని ఎస్‌డీపీఐ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి మహమ్మద్‌ఘని తెలిపారు. అధ్యక్షుడిగా సిద్దిక్, ఉపాధ్యక్షుడిగా ఖాదర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా ఆసిఫ్, కార్యదర్శిగా షామీర్, కోశాధికారిగా సద్దామ్, కార్యవర్గ సభ్యులుగా అబ్దుల్ కలేదర్, రషీద్, చాంద్‌బాషా, నౌషాద్, అతిక్‌బాషా, మహమ్మదాలి, రాయల్‌బాబా, తోఫిక్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ప్రతినిధులు రోషన్, యూసుఫ్, మహమ్మద్ చాంద్‌బాషా, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

మండలానికి 8,748 స్మార్ట్ రేషన్ కార్డులు

రొంపిచెర్ల: స్మార్ట్ బియ్యం కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అమరనాథ్ కోరారు. సోమవారం ఆయన స్మార్ట్ బియ్యం కార్డులకు పంపిణీ చేసి మాట్లాడారు. మండలానికి 8748 స్మార్ట్ బియ్యం కార్డులు మంజూరు అయ్యాయని, వీటిని వీఆర్వో, సచివాలయ ఉద్యోగులు, చౌక దుకాణం డీలర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే తెచ్చి ఇస్తారన్నారు. బియ్యం కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి మళ్లీ స్మార్ట్ బియ్యం కార్డు వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, డీటీ కిరణ్‌కుమార్, టీడీపీ ఇన్‌చార్జ్, నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో తలారి మృతి


బుడ్డారెడ్డి (ఫైల్)

పెద్దపంజాణి: మండలంలోని బందార్లపల్లెకు చెందిన పెద్దకాప్పల్లె గ్రామ తలారి టి.బుడ్డారెడ్డి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఇది తెలుసుకున్న తహసీల్దార్ హనుమంతు ఆయన మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రభుత్వ సాయం కింద రూ.25 వేలు మృతుని భార్య రత్నమ్మకు అందజేశారు.

విరిగిన చింతకొమ్మ


తోటకురప్పల్లె వద్ద చింతకొమ్మ పడి తెగిన వైర్లు, కూలిన విద్యుత్ స్తంభం

చౌడేపల్లె: చింత చెట్టుకొమ్మ విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో వైర్ల తోపాటు విద్యుత్ స్తంభం ధ్వసమైన ఘటన తోటకుప్పల్లె వద్ద సోమవారం చోటు చేసుకుంది. మండలంలోని శెట్టిపేట పంచాయతీ, తోటకురపల్లె నుంచి పెద్ద ఉప్పరపల్లెకు వెళ్లే మార్గంలో ఈ ఘటన జరగడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఆ సమయంలో ఈ మార్గంలో ఎవ్వరూ రాకపోకలు సాగించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో ఏఈ శశిధర్ యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



గాయపడిన రఘునాథరెడ్డి, పవనకుమారి

బంగారుపాళెం: మండలంలోని కేజీసత్రం వద్ద సోమవారం చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. తవణంపల్లె మండలం సరకల్లుకు చెందిన రఘునాథరెడ్డి తన భార్య పవనకుమారితో టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై మండలంలోని కల్లూరుపల్లెకు వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. కేజీ సత్రం వద్ద జాతీయ రహదారిలోని మలుపు సమీపంలో రోడ్డును దాటుతుండగా, పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కంటైనర్ వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎంతసేపూ కక్ష సాధింపులేనా..?


పలమనేర లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, నేతలు


వీ.కోట: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- ఎన్నికల హామీలు పూర్తిగా నెరవేర్చకుండా నట్టేట ముంచిన బాబు
- ప్రశ్నిస్తే అక్రమ కేసులు, దౌర్జన్యకాండ, ఆస్తుల విధ్వంసం
- 'రెడ్‌బుక్' అరాచకం, గాడి తప్పిన పాలన
- కూటమి పాలనలో ఓ ఇంటినైనా మంజూరు చేశారా?
- కూటమి అక్రమ కేసులకు రెండింతలు రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం
- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ'లో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ విమర్శ


గంగవరం: కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు/గంగవరం: ''కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇప్పటికీ వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేస్తూనే ఉన్నారు..ఉద్దేశపూర్వకంగా పనికట్టుకుని కక్ష సాధింపు చర్యలతో దౌర్జన్యం చేస్తున్నారు..అక్రమ కేసులు బనాయిస్తున్నారు..ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు.. అభివృద్ధి మాటే లేదు.. నారా లోకేష్ విరచిత 'రెడ్‌బుక్' అరాచకమే రాష్ట్రంలో రాజ్యమేలుతోంది..చంద్రబాబు పాలన గాడి తప్పింది..రాబోవు కాలంలో వీటన్నింటికీ రెండింతలు రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం..'' అని పలమనేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వెంకటేగౌడ నిప్పులు చెరిగారు. సోమవారం పలమనేరు మున్సిపాలిటీతోపాటు గొల్లపల్లె, కొలమాసనపల్లె, గంగవరం మండలం శ్రీలంక కాలనీలో ×బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ₹ కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక ఎద్దులచెరువు వద్ద ఓంశక్తి ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని 26వార్డులో మొదలు పెట్టారు. ఇంటింటికీ వెళ్లి, కరపత్ర ప్రచారం చేయడంతోపాటు అందులోని క్యూఆర్‌కోడ్‌తో చంద్రబాబు హామీలను నెరవేర్చని వైనాన్ని తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ, ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కేవలం వైఎస్సార్‌సీపీని టార్గెట్ చేసి తప్పుడు కేసులు బనాయించడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలైనా ఈ నియోజకవర్గంలో కనీసం ఓ ఇంటినైనా మంజూరు చేశారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. అభివృద్ధి మాటేలేదని విమర్శించారు. తాజాగా గంగవరం మండల బీసీ మహిళా నేతపై టీడీపీ నాయకులు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. చంద్రబాబు పాలనలో చోటు చేసుకుంటున్న అవినీతి, ప్రజా వ్యతిరేక విధానాలను స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. మోసం చేసిన కూటమి పాలకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో పలమనేరు మున్సిపల్ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డి, మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, మున్సిపల్ వైస్ చెర్మన్లు గుల్జార్, రవి, నాయకులు మురళీకృష్ణ, రహీంఖాన్, శ్యామ్, కోదండరామయ్య, సోమచంద్రారెడ్డి, నరేష్, మజ్జు, రెడ్డెప్ప రెడ్డి, రూరల్ నాయకులు రంగన్న, విశ్వనాథరెడ్డి, చెంగారెడ్డి, రాజారెడ్డి, కొలమాసనపల్లె నాయకులు, గంగవరం మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రహ్లాద, యూత్ అధ్యక్షులు కిషోర్ నాయుడు, నాయకులు చంద్రప్ప, గిరి రాజారెడ్డి, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి, రాధాక్రిష్ణ, వినోద్‌రెడ్డి, రెడ్డిప్రసాద్, ఆనంద, పట్టాభిరామయ్య, మురళి, మంజునాథ్‌రెడ్డి, బద్రి, విజయ్, బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీ.కోటలో..

వి.కోట: మండలంలోని గోనుమాకులపల్లె పంచాయతీలో సోమవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కలిసి నిర్వహించారు. వారు మాట్లాడుతూ, తమ ప్రభుత్వ హయాంలో పలమనేరు నియోజకవర్గంలో 88 రైతు భరోసా కేంద్రాలు నిర్మించి, దాదాపు 7 వేల మంది రైతులకు సేవలందిస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి తూట్లు పొడిచిందని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా వస్తున్న దాదాపు 7,021 మంది రైతులకు చంద్రబాబు ×అన్నదాత సుఖీభవ పథకాన్ని₹ ఎగ్గొట్టారని విమర్శించారు. ఈ మోసం, వంచనను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ యువరాజ్, వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్, సర్పంచ్ జ్యోతి బాలాజీ, నాయకులు అమరనాథ్, ఉదయ్, గోపిరెడ్డి, ఇంద్రేష్, మంజునాథ్, మణి, పూలనాగ, శ్యామ్, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు



నేడు వైఎస్సార్ వర్ధంతి

పుంగనూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక బస్టాండులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించి, అన్నదానం చేయనున్నట్టు మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా తెలిపారు. కో–ఆప్షన్ మెంబర్లు, కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ సంస్థల ప్రతినిదులు, పార్టీ అభిమానులు పాల్గొనాలని కోరారు.

పలమనేరు, మొరంలో..

పలమనేరు: పట్టణంలోని ఏఎంసీ వద్దనున్న వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్టు పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరవుతారని, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. అలాగే, మొరంలోనూ వర్ధంతి నిర్వహించనున్నట్టు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి తెలిపారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద మంగళవారం ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ వర్ధంతి నిర్వహిస్తామని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి తెలిపారు. అందరూ పాల్గొనాలని కోరారు.

పంటలపై ఏనుగుల దాడి


పాళెం పంచాయతీ సిద్ధరాజు పొలంలో ఏనుగులు విరిచేసిన డ్రిప్ సామగ్రి, మామిడి కొమ్మలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు, పాళెం పంచాయతీలలో సోమవారం తెల్లవారు జామున అటవీ ప్రాంతాల సమీపంలోని పంటలపై ఏనుగులు దాడి చేసి నష్టం కలిగించాయి. డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. మూడు రోజులుగా ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తూ పంటలపై పడుతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తమ పొలాల వద్దకు వెళ్లడానికి జంకుతున్నారు.

మంచినీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు


నీటి నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్

పలమనేరు: మున్సిపాలిటీలో మంచినీటి పంపిణీ పరంగా ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని నీటి విభాగం సిబ్బందిని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని పలుచోట్ల మున్సిపల్ కొళాయిల్లో నీటిని సోమవారం ఆయన సిబ్బందితో కలసి నాణ్యత టెస్టులు చేశారు. అనంతరం పట్టణంలోని పంప్ హౌస్‌లు, ఓవర్‌హెడ్ ట్యాంకులను పరిశీలించారు. ఎక్కడైనా పైపులైన్ రిపేర్లుంటే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడాలని, దుబారా చేయరాదని విజ్ఞప్తి చేశారు.

నిమజ్జనాల్లో జగనన్న పాటల జోరు!


బైరెడ్డిపల్లె మండలంలో నిమజ్జన కార్యక్రమంలో జగనన్న డీజేల హోరులో చిన్నారులు

పలమనేరు: నియోజకవర్గంలో సాగుతున్న వినాయక చవితి నిమజ్జనాల్లో పలుచోట్ల పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా జగనన్న పాటలతో యువకులు, చిన్నారులు నృత్యాలు చేస్తూ హోరెత్తిస్తున్నారు. జనం కూడా దీనిని ఎంజాయ్ చేస్తున్నారు. ఫలితంగా నిమజ్జనాల్లో వైఎస్సార్‌సీపీ డీజే సాంగ్స్‌కు భలే డిమాండ్ వచ్చింది. సౌండ్ నిర్వాహకులు సైతం ముందుగానే జగనన్న పాటలుంటాయని చెప్పి మరీ ఆర్డర్లు తీసుకోవడం కొసమెరుపు!

మహిళలపై కూటమి దాడులు దుర్మార్గం


మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ఎదుట కన్నీళ్లు పెట్టుకున్న కవిత

గంగవరం: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలోని మహిళలపై అరాచకాలు, దాడులు విపరీతంగా పెరిగాయని, ఇలాంటి దురాగతాలకు పాల్పడడం సమంజసం కాదని మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హితవు పలికారు. టీడీపీ వర్గీయుల దాడిలో గాయాలపాలై పలమనేరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆలకుప్పం గ్రామానికి చెందిన బీసీ మహిళా అధ్యక్షురాలు కవిత, ఆమె సోదరి నందినీని ఆయన పరామర్శించారు. దాడి ఉదంతాన్ని అడిగి తెలుసుకున్నారు. బాధితుల కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, పోలీసు బలాన్ని అడ్డం పెట్టుకుని మహిళలపై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతుంటే సహించేది లేదన్నారు. బాధితులకు న్యాయం చేసి, దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మృతులకు సంతాపం

గత ఆదివారం రాత్రి మండలంలోని చిన్నమనాయనిపల్లి గ్రామంలో వినాయకస్వామి నిమజ్జనంలో అదే గ్రామానికి చెందిన యువకులు భార్గవ్(28), చరణ్(27) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. సోమవారం మృతదేహాలకు పలమనేరు ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం గ్రామానికి తరలించారు. మృతుల్లో భార్గవ్ జగనన్నకు వీరాభిమాని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. సమాచారం తెలుసుకున్న వెంకటేగౌడ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. మాలధారణలో ఉండడం వల్ల గ్రామానికి రాలేకపోయానని మీడియా ద్వారా మృతుడి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానంటూ భరోసా ఇచ్చారు. పార్టీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, పార్టీ సంయుక్త కార్యదర్శి ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి ఉన్నారు.

కార్యకర్తకు పరామర్శ


కార్యకర్త షఫీని పరామర్శిస్తున్న ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి

రొంపిచెర్ల: రోడ్డు ప్రమాదంలో గాయ పడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తను ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి సోమవారం పరామర్శించారు. మండలంలోని గానుగచింతకు చెందిన షఫీ నెల క్రితం బైక్‌లో వెళ్తుండగా పాల వ్యాన్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం నాలుగు రోజుల క్రితం ఇంటికి వచ్చాడు. దీంతో ఎంపీపీ పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బావాజి, రెడ్డిశేఖర్ రెడ్డి, బాబు, కుమార్ నాయుడు, లీలా ప్రసాద్ నాయుడు, సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుక్క కళేబరం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..


కళేబరాన్ని తొలగించి శుభ్రం చేసిన దృశ్యం

చౌడేపల్లె: బోయకొండ గంగాపురంలోని పార్కు ముందు కుక్క కళేబరాన్ని సోమవారం సిబ్బంది ఎట్టకేలకు తొలగించారు. 'పార్కులోకి వెళ్లాలంటే ముక్కులు మూసుకోవాల్సిందే'.. శీర్షికతో సాక్షి దినపత్రిక ప్రచురించిన కథనంపై ఈఓ ఏకాంబరం ఆయన ఆదేశాలతో సిబ్బంది కుక్క కళేబరాన్ని తొలగించి, దుర్వాసన లేకుండా చర్యలు తీసుకున్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానిక గాంధీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. గాంధీనగర్‌కు చెందిన సర్దార్ (37) పట్టణంలో కొంత మంది వద్ద అప్పులు చేశాడు. వారి వేధింపులు తాళలేక ఇంట్లో ఎలుకల మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. కుటుంబ సభ్యులు అతన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీలకు ఇన్‌చార్జ్‌ల నియామకం

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని అన్ని పంచాయతీలకు వైఎస్సార్‌సీపీ కోర్ టీమ్‌లను (పంచాయతీ ఇన్‌చార్జులు) నియమించారు. మూడు, నాలుగు పంచాయతీలకు ఒక ఇన్‌చార్జ్ చొప్పున నియమించినట్టు నాయకులు తెలిపారు. పంచాయతీల ఇన్‌చార్జులుగా పోకల అశోక్‌కుమార్, రెడ్డీశ్వరరెడ్డి, డి.సురేంద్రనాథరెడ్డి, సి.నాదమునిరెడ్డి, ఎం.హేమసుందరరెడ్డి, ముర్వత్‌బాషా, చంద్రశేఖరరెడ్డి, అలాగే ఐటీ వారియర్లుగా సురేష్, అమరనాథరెడ్డి, డి.నిరంజన్‌రెడ్డి, ఎస్.గిరికుమార్‌రెడ్డి, మునితేజ, శివారెడ్డి, సయ్యద్‌బాషా నియమితులయ్యారు.

IN THE COURT OF THE DEPUTY COMMISSIONER AT KOLAR
RAP. NO.114 / 2025
Appellant : Yogeshwari
V/s
Respondents : Assistant Commissioner And others
NOTICE UNDER ORDER 5 RULE 20 OF CPC TO respondent No.3
2.Padmavathi B.V
W/o Subbaramaraju B
Aged about 60 years
3. Chandrashekar Raju
S/o Venkataramaraju
Aged about 63 years
Both are residing at No.341A Sandhaghattu, V-Kote, Palamaneru Taluk,Chittor district Andhra Pradesh

Whereas, the appellant have instituted the above appeal against appeal against the orders passed by the orders passed by the 1st respondent in favour of the Respondent No. 2 and 3 in Ra.No.5/2022 dt.22.11.2024 in respect of Sy No.629, 628, 630, 631, 633, 627 of Bethamnagala village, and Hobli, K.G.F. Taluk. This Hon'ble court be pleased to issued notice to the respondent No.2 and 3 are intentionally evading and avoiding to receive the summons issued by this Hon'ble court. Hence you respondent No.2 and 3 are hereby notice to appear in this court in an or by person advocate **09-09-2025. at 3 p.m.** to file objections to the appeal, in default of your appearance on the same day the court take as exparte.

Given under my hand seal and signature on this 19/08 of 2025 at Kolar.

By order of the court.
Sd/- DEPUTY COMMISSONER KOLAR
Advocate of appellant
A.Lakshminarayana,Advocate,Kolar
Kolar Date:01.09.2025

వివాదాస్పద భూమి సర్వే

- 15రోజుల్లో స్వాధీనం చేసుకుంటామన్న రెవెన్యూ అధికారులు

శాంతిపురం: మండలంలోని డొంకుమాకనపల్లె రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 92/2లోని వివాదాస్పద భూమిని రెవెన్యూ అధికారులు సోమవారం సాయంత్రం సర్వే చేశారు. ఈ 2.08 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కరేగానూరు గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన అధికారులు నిర్మాణాలు ఉన్న ఈ భూమి ప్రభుత్వానికి చెందినదిగా నిర్ధారించారు. స్వాధీనంలోని వారు దీనిపై కుప్పం ఆర్డీఓను ఆశ్రయించగా వారి వాదనను ఆయన తిరస్కరించారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ శివయ్య, వీఆర్వోలు, సర్వేయర్లు వెళ్లి భూహద్దులను గుర్తించారు. నిబంధనల మేరకు మరో 15 రోజుల్లో భూమిని, దానిలోని నిర్మాణాలను స్వాధీనం చేసుకుంటామని రెవెన్యూ అధికారులు చెప్పారు.

ఆగని కలప అక్రమ రవాణా!



పలమనేరు సమీపంలోని హైవేలో వెళుతున్న కలప ట్రాక్టర్లు

- పగటిపూట ట్రాక్టర్లు, రాత్రుల్లో లారీలలో తరలింపు
- చెట్ల కటింగ్ ఆర్డర్ మాటే లేదు
- పట్టించుకోని అటవీ శాఖ

పలమనేరు: నియోజకవర్గంలో కలప రవాణా అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పగటి పూట ఎటు చూసినా రయ్యిన దూసుకుపోతున్న కలప ట్రాక్టర్లు కనిపిస్తున్నాయి. ఇక రాత్రుల్లో లారీలలో జోరుగా కలపను సరిహద్దు దాటిస్తున్నారు. కలప లారీలు గ్రామీణ దారుల్లో కాదు..యథేచ్ఛగా హైవేలలో వెళ్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపానపోవడం లేదు. వాస్తవానికి నిబంధనలకు మేరకు చెట్లు కొట్టాలంటే రెవెన్యూ, అటవీశాఖల నుంచి కటింగ్ ఆర్డర్‌కు అనుమతి పొందాలి. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిబంధనలు ఎవరూ పాట్టించడం లేదు. దర్జాగా కలపను కొట్టి, అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. ఫలితంగా కలప అక్రమ రవాణా జోరందుకుంది.

ఇక్కడి నుంచి తమిళనాడు, కర్ణాటకకు..

నియోజకవర్గంలో ఎక్కువగా వృక్షాలు రైతుల పొలాలు, ప్రభుత్వ భూములు, అడవులోనే ఉన్నాయి. ప్రధానంగా వ్యాపారులు రైతుల భూముల్లోని చెట్లను కొనుగోలు చేసి, వాటిని గ్రేడింగ్ చేసి, కొన్నింటిని వంట చెరకు, మరికొన్నింటిని పాల డెయిరీలు, బాగున్న కలపను చెక్క వస్తువుల తయారీ దారులకు విక్రయిస్తున్నారు. కలపకు పొరుగు రాష్ట్రాల్లో ఎక్కువగా డిమాండ్ ఉండటం అవకాశంగా తీసుకుని ఇక్కడ కలప స్మగ్లర్లు విపరీతంగా చెట్లను నరికివేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

వాల్టా..ఉల్టా

సాధారణంగా రైతుల పొలాల్లోని చెట్లను నరకాలంటే ఆ రైతు వీఆర్వో నుంచి అనుమతులు పొందాలి. ఆపై దాన్ని ఆర్ఐ పరిశీలించి ఓకే చెప్పాక తహసీల్దార్ ఉత్తర్వులు ఇస్తారు. వాల్టా చట్టం ప్రకారం ఫారెస్ట్ అధికారుల నుంచి సైతం పర్మిషన్ పొందాల్సి ఉంటుంది. గతంలో ఇలా నిబంధనల ప్రకారం సాగేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కటింగ్ ఆర్డర్‌ను తీసుకునే వాళ్లే లేరు! అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదు. అధికారుల కళ్లముందే కలప ట్రాక్టర్లు, లారీలు వెళుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎవరైనా ధైర్యం చేసి వాహనాలను నిలబెడితే.. ''ఇందా అన్నతోమాట్లాడు..! మేం కూటమి వాళ్లమి సార్..'' అని ఫోన్ చేతికిస్తున్నారు! ఉన్నతస్థాయి అధికారులే పట్టించుకోనప్పుడు తమకెందుకు లేనిపోని ఇబ్బందులనే ఉద్దేశంతో కిందిస్థాయి సిబ్బంది చోద్యం చూడాల్సి వస్తోంది.